క్లుప్తంగా

వధూవరులకు ఆశీస్సులు



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఆర్కే సెల్వమణి

పుత్తూరు: స్థానిక జీడీఆర్ కల్యాణమండపంలో శనివారం జరిగిన మున్సిపల్ వైస్ చైర్మన్ డి.శంకర్ కుమారుడు దిలీప్‌కుమార్ వివాహ రిసెప్షన్‌లో ప్రముఖ సినీ దర్శకులు, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

సులభతర బోధనకే జ్ఞానజ్యోతి



శిక్షణ ఇస్తున్న కో–ఆర్డినేటర్ కుమార్

పాలసముద్రం : చిన్నారులకు ఆటపాటలతో కూడిన సులభతరమైన బోధన అందించడానికే అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి పేరిట శిక్షణ ఇస్తున్నట్లు కోఆర్డినేటర్ కుమార్ తెలిపారు. శనివారం ఎమ్మార్సీలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ జరిగినది. కోఆర్డినేటర్ కుమార్ మాట్లాడుతూ ఈ శిక్షణ వల్ల చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యం, ఆహార నియమాలు, పరిశుభ్రత లాంటి విషయాలు అవగతం చేసుకునేందుకు దోహదపడుతుందన్నారు. చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్య నేర్పేందుకు మంచి అవకాశం అన్నారు. గ్రామస్థాయిలో సామాజిక చైతన్యంతో పాటు మూఢనమ్మకాలను, బాల్య వివాహాలను రూపుమాపవచ్చన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహంలో తనిఖీలు



వసతి గృహం విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసంతి

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని బాలికల వసతి గృహంలో శనివారం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసంతి తనిఖీలు నిర్వహించారు. చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు మండలంలోని బాలికల వసతి గృహాల్లో భద్రతా తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బాలికలతో మాట్లాడుతూ వసతి గృహంలోని బాలికల రక్షణ తమ బాధ్యత అని విద్యార్థినులకు ఆమె భరోసా కల్పించారు. బాలికల రక్షణ విషయమై హాస్టల్ అధికారులను ఆరా తీశారు.

మాతృభాష వారసత్వ సంపద



మాట్లాడుతున్న అధ్యాపకులు నరసింహులు

పుత్తూరు: మాతృభాష మన వారసత్వ సంపద అని స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ వి.వీరయ్య అన్నారు. కళాశాలలో శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డ ఎలాంటి శిక్షణ లేకుండా తల్లి నుంచి నేర్చుకునే భాష మాతృ భాష అని చెప్పారు. ఒక జాతి ఉనికిని, సంస్కృతి సంప్రదాయాలను మాతృభాష తర్వాతి తరాలకు అందిస్తుందని తెలిపారు. విద్యార్థులకు తెలుగు భాషలో ఉపన్యాస, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా రీసర్వే



మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణ కుమారి

పాలసముద్రం: మండల పరిధిలోని గ్రామాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా భూముల రీసర్వే చేయాలని తహసీల్దార్ అరుణ కుమారి తెలిపారు. శనివారం రెవెన్యూ కార్యాలయంలో సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ విలేజ్ సర్వేయర్, వీఆర్‌ఓ రీసర్వే చేయడానికి ముందు రైతుల వద్ద ఉన్న రికార్డులను నిశితంగా పరిశీలించి, వారు సాగుచేసిన భూమి వద్దకు వెళ్లి వారి ఆన్‌లైన్ చేయాలని, అప్పుడే రైతుల భూసమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ముఖ్యంగా సరిహద్దులో ప్రభుత్వ భూముల ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రిషివర్మ, ఏఆర్ఐ దేవి, వీఆర్‌ఓ తంగరాజ్, శ్రీనివాసులు, రమేష్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈసారీ కందిపప్పు లేదు

రాష్ట్రంలో కూటమి పాలన మాటలకే పరిమితమైంది కానీ ఆచరణలో శూన్యంగా ఉంది. ఎన్నికలకు ముందు పూర్తి స్థాయిలో రేషన్ సరుకులు కోటా ఇస్తామని చెప్పిన కూటమి నాయకులు అరకొర సరకులతోనే చేతులు దులిపేసుకుంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆటో, కారు వాహనాల వారికి వాహనమిత్ర, మహిళలకు సున్నావడ్డీ, అమ్మ ఒడి పేరిట వారివారి ఖాతాల్లో నగదు జమ చేసేది. అలాగే పండగల సమయంలో అన్ని సరుకులు అందించేది. ఈ ఏడాది అలాంటివి లేక పోయినా రేషన్ డిపోల ద్వారా అందించే సరకులు కూడా సక్రమంగా అందక పేదలు ఇబ్బందులు పడుతున్నారు.



రేషన్ సరఫరా చేస్తున్న బండి

- అరకొర కందిపప్పుతోనే సరి
- ఒక చౌక దుకాణానికి వంద కిలోలేనట
- అందరికీ అందక కార్డుదారుల గగ్గోలు

విజయపురం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రేషన్ సరుకులు సక్రమంగా ప్రజలకు అందడం లేదు. ఈ సారి కూడా బియ్యం, చక్కెర తప్ప కందిపప్పు ఇవ్వలేదు. కందిపప్పు అరకొరగా ఇవ్వడంతో చాలా మందికి కందిపప్పు అందక అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నగరి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మొత్తం 204 రేషన్ షాపులు 71,138 కార్డు దారులు ఉన్నారు. కార్డుకు కిలో చొప్పున సుమారు 71టన్నుల కందిపప్పు సరఫరా చేయాల్సి ఉంది. కానీ ఒక్కొక్క షాపుకి 100 కిలోలు మాత్రమే సరఫరా చేశారు. దీంతో రేషన్ డిపోల ద్వారా మొదట వచ్చిన వారికి మాత్రమే కందిపప్పు అందజేసి, మిగిలిన వారికి ఒట్టి చేతులను చూపుతున్నారు. మరి కొన్ని షాపుల్లో డీలర్లు లబ్ధిదారులకు పూర్తిగా కందిపప్పు ఇవ్వలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కందిపప్పు ఏదీ?

కూటమి ప్రభుత్వం రేషన్ సరకులు పూర్తి స్థాయిలో ఇవ్వడం లేదు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ డిపోల ద్వారా బియ్యంతో పాటు కంది పప్పు, పంచదార ఇచ్చేవారు. ఈ నెలలో కొన్ని డిపోలకు మాత్రమే కందిపప్పు వచ్చిందని చెబుతున్నారు. – అనసూయ, పన్నూరు

మార్కెట్‌లో కంది రూ.180

కంది పప్పు ధర బహిరంగ మార్కెట్లో కిలో రూ.190 ఉండగా, సూపర్ బజార్లో రూ.185, రైతు బజార్లలో రూ.150కి విక్రయిస్తున్నారు. రేషన్ డిపోల్లో కిలో కందిపప్పు కిలో రూ.67కే ఇవ్వడంతో డిమాండ్ అధికంగా ఉంది. కేవలం బియ్యం, పంచదార మాత్రమే ఇస్తూ గంటల తరబడి నిరీక్షించేలా చేస్తున్నారని కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బియ్యంతో సరి..

ప్రతి నెలా కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న ఉచిత బియ్యం మాత్రమే అందజేస్తున్నారు. కూటమి నేతలు ఎన్నికల్లో రేషన్ డిపోల ద్వారా అన్ని రకాల పప్పులు రాయితీ ధరలకు ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి తొమ్మిది నెలలు దాటిపోయి పండగ కూడా చేసుకున్నారు. కానీ ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించలేదు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గోదాముల తనిఖీల సందర్భంగా తూకంలో తేడా ఉందన్న నెపంతో పంచదార, కందిపప్పు నిల్వలను వెనక్కు పంపేశారు. అంత వరకు బాగానే వుంది. వరుసగా రెండు నెలల పాటు బియ్యం, చక్కెర తప్ప మిగిలినవి ఏవీ పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదు. ఒక్కో డిపోకు వెయ్యి రేషన్ కార్డుల వరకు ఉన్నాయి. కానీ, ఒక్కో డిపోకు కందిపప్పు కేవలం వంద కిలోలు ఇవ్వడంతో కార్డుదారులకు డీలర్లు సమాధానం చెప్పలేక తలలు పట్టుకుంటున్నారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోండి



రీసర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు

కార్వేటినగరం: ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీసర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నాగరాజు అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని కత్తెరపల్లిలో జరుగుతున్న రీసర్వేని సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూసమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం రీసర్వే నిర్వహిస్తోందని ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రీసర్వేలో ఎలాంటి లోసుగులు ఉన్నా.. తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహణలో ఎలాంటి పక్షపాతం లేకుండా నిష్పక్షపాతంగా తమ విధులను నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ స్వరూపరాణి, మండల సర్వేయర్ బాబు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఒక మంచి ఆలోచన జీవితాన్నే మార్చేస్తుంది



బహుమతులు అందజేస్తున్న వెంకటేశ్వర్లు

పుత్తూరు: ఒక మంచి ఆలోచన జీవితాన్నే మార్చేస్తుందని స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ ఏ.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గేట్‌పుత్తూరులోని స్కౌట్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ సెంటర్ వద్ద శనివారం వరల్డ్ స్కౌట్ డేను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కౌట్ ఉద్యమ వ్యవస్థాపకులు స్టీఫెన్ స్మిత్ రాబర్ట్ బెడన్ పోవెల్ జయంతిని పురస్కరించుకొని వరల్డ్ స్కౌట్ డే జరుపుకుంటున్నట్లు తెలిపారు. స్కౌట్ అండ్ గైడ్స్‌లో చేరాలన్న ప్రతి విద్యార్థి ఆలోచన ఎంతో గొప్పదని అన్నారు. చిన్నతనం నుంచి సమాజ సేవ చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. స్కౌట్ అండ్ గైడ్స్‌లో చేరడం ద్వారా క్రమశిక్షణతో కూడిన సేవామార్గం అలవడుతుందని తెలిపారు. సమాజం పట్ల అవగాహన ఏర్పడుతుందని తెలిపారు. ఎయిడ్స్, పల్స్ పోలియో, పచ్చదనం పరిశుభ్రత వంటి పలు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గైడ్ కెప్టెన్ రాధిక, రోవర్ లీడర్ జైకుమార్, గైడ్స్ లీడర్స్ యువశ్రీ, జోత్స్న, చార్మి, భాను, స్కౌట్ మాస్టర్ అశోక్‌కుమార్, స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్తను ఈ వాహనాల్లోనే వేయాలి

నగరి : పట్టణంలో పోగయ్యే చెత్తను ఇంటివద్దకు వచ్చే చెత్తసేకరణ వాహనాల్లోనే వేయాలని ఎంపీడీవో కృష్ణయ్య సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం డోర్ టు డోర్ చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ చెత్తను చెత్తసేకరణ కేంద్రానికి తరలించి చెత్త నుంచి సంపద తయారుచేసుకొని గ్రామ పంచాయతీకి ఆదాయం చేకూర్చాలని చెప్పారు. క్లాప్ మిత్రులు ప్రతి ఇంటికీ వెళ్లి చెత్త సేకరణ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

స్కూల్ బస్సుల తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న ఎంవీఐ చంద్రశేఖర్

పుత్తూరు: విద్యార్థుల భద్రత దృష్ట్యా విద్యాసంస్థల బస్సుల నిర్వహణపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ జి.రవికుమార్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం పుత్తూరు, రేణిగుంట తదితర ప్రాంతాల్లో పలు ప్రైవేటు స్కూల్స్, కళాశాలల బస్సులు, వ్యాన్లను ఆర్టీఐ అధికారులతో కలిసి తనిఖీలు చేశారు. డ్రైవర్లకు వాహనాలు నడుపుతున్నప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, పుత్తూరు, సూళ్లూరుపేట ఎంవీఐలు చంద్రశేఖర్, అనిల్ పాల్గొన్నారు.

మూలకోనకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు



డీఎం ప్రశాంతిని ఆహ్వానిస్తున్న ఆలయ నిర్వాహకులు

పుత్తూరు: ప్రకృతి సోయగాలకు నిలయమైన మూలకోనకు మహాశివరాత్రిని పురస్కరించుకొని ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడపడానికి డిపో మేనేజర్ అంగీకరించినట్లు ఆలయ నిర్వాహకులు కె.భాస్కర్‌రెడ్డి తెలిపారు. డిపో మేనేజర్ ప్రశాంతిని శనివారం కలిసిన ఆలయ నిర్వాహకులు మూలకోన మహాశివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానించడంతో పాటు ప్రత్యేక బస్సులను నడపాల్సిందిగా కోరారు. దీనిపై స్పందించిన మేనేజర్ ప్రశాంతి మాట్లాడుతూ మహాశివరాత్రిని పురస్కరించుకొని కోనకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఈ నెల 26, 27 తేదీల్లో పుత్తూరు నుంచి మూలకోనకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతామని వెల్లడించారు. కార్యక్రమంలో కె.వెంకటేశులురెడ్డి, జి.వెంకటరత్నం, వి.గురుమూర్తి పాల్గొన్నారు.

రాస్ సేవలు ఎనలేనివి

కార్వేటినగరం: రాస్ స్వచ్ఛంద సంస్థ సేవలు గర్వించదగినవని కత్తెరపల్లి ఉప సర్పంచ్ కుప్పయ్య అన్నారు. కత్తెరపల్లిలో శనివారం రాస్,శంకర్ నేత్రాలయ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం మాట్లాడుతూ 120మందికి నేత్ర పరీక్షలు చేసి, అందులో 23 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు చెప్పారు. రాస్ డైరెక్టర్ నాగరాజు, శంకర్ నేత్రలయ వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

కార్వేటినగరం: ఆర్కేఎస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 49వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ స్వరూప మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్మీడియట్ మైలురాయి వంటిదన్నారు. అధ్యాపకులు డాక్టర్ కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఏఎస్ఐ గోవింద స్వామి, కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా చెత్త సేకరణ

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం, సంతబయలు, వెదురుకుప్పం పంచాయతీల్లో శనివారం పంచాయతీ విస్తరణాధికారి పురుషోత్తం ఆధ్వర్యంలో ముమ్మరంగా చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో అంతర్గత రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త, చెదారాలను తొలగించారు. అదేవిధంగా మురుగునీటి కాలువల్లో మురుగును శుభ్రం చేశారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేపట్టినట్లు ఈఓపీఆర్డీ పురుషోత్తం తెలిపారు. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, సంక్షేమ, విద్యా సహాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణపై ప్రత్యేక శ్రద్ధ

పాలసముద్రం: గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే తడి–పొడి చెత్త సేకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి తెలిపారు. శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు గ్రామాల్లో చెత్త సేకరిస్తున్న వాహనాన్ని సర్పంచ్ గాలి మహేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ చెత్త సేకరణతో పరిశుభ్రతతో పాటు చెత్త నుంచి సంపద తయారు చేస్తే పంచాయతీకి ఆదాయం వస్తుందన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి రాఘవేంద్ర

కార్వేటినగరం: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పుత్తూరు సీనియర్ సివిల్‌జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర అన్నారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ సివిల్‌జడ్జి మాట్లాడుతూ బాలికల పట్ల వివక్షత తల్లిదండ్రుల నుంచే మొదలవుతుందని.. అధునాతన కాలంలో అలాంటి వాటికి తావివ్వకూడదన్నారు. బాలికలు పోక్సో చట్టంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్ల ద్వారా వచ్చే మెసేజ్‌లకు బాలికలు దూరంగా ఉండాలని, వాటి ద్వారా సైబర్ నేరగాళ్లు అమ్మాయిలను మోసం చేసి హింసించే అవకాశం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు బాలికల రక్షణ కోసం ఉన్న చట్టాలను వారికి క్షుణ్ణంగా వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలంటే వారికి తప్పనిసరిగా విద్య అవసరం అన్నారు. పురుషులకు దీటుగా రాణిస్తున్న మహిళలకు పూర్తిస్థాయి స్వేచ్ఛ కల్పించాలన్నారు. కొందరు తల్లిదండ్రులు అవివేకంతో ఆడపిల్లలను ఉన్నత చదువులకు పంపడం లేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎస్ఐ రాజ్‌కుమార్, పంచాయతీ ఈఓ నాగరత్నమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తమ భూమిని కాపాడాలని వేడుకోలు



మాట్లాడుతున్న బాధిత కుటుంబ సభ్యులు

శ్రీరంగరాజపురం : తన పేరిట ఉన్న భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు లేనిపోని వివాదాలు సృష్టించి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండలంలోని పుల్లూరు క్రాస్‌కు చెందిన లోకనాథనాయుడు భార్య జయమ్మ వాపోయారు. శనివా రం బాధితురాలు జయమ్మ మీడియాతో మాట్లాడుతూ.. తన భర్త లోకనాథనాయుడుకి శ్రీరంగరాజపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 38లో ఒక ఎకరా భూమి ఉండేదన్నారు. ఈ భూమిలో టీటీడీ కల్యాణ మండపం నిర్మించేందుకు 1989లో విరాళంగా ప్రకటించినట్లు పేర్కొన్నారు. అప్పట్లో కల్యాణ మండపం నిర్మాణం చేపట్టేందుకు ముందుకు రాకపోవడంతో పాటు కుటుంబంలో తలెత్తిన వివాదాలు, ఆర్థిక పరమైన సమస్యల నేపథ్యంలో తన భర్త టీటీడీకి విరాళంగా ఇచ్చిన భూమిని తిరిగి ఇవ్వాలని 2000, 2003 రెండు పర్యాయాలు వినతి పత్రాలు సమర్పించినట్లు పేర్కొన్నారు. దీంతో టీటీడీ అధికారులు పరిశీలించి ఇది వివాదాస్పద భూమిగా నిర్ధారించుకుని 2015సంవత్సరంలో అప్పటి టీటీడీ ఈఓ సాంబశివరావు తిరిగి అప్పగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. మండల కేంద్రంలోని పలుకుబడి గలిగిన నాయకులు ఎలాగైనా ఆ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

రైతు గుర్తింపు నమోదు తప్పనిసరి

విజయపురం : మండలంలో ప్రతి రైతు గుర్తింపు కార్డులను నమోదు చేసుకోవాలని ఏవో రజినీ కుమారి అన్నారు. మండలంలోని గ్రామాల్లో శనివారం రైతు సేవా కేంద్రంలో రైతు గుర్తింపు రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ప్రతి రైతు విశిష్ట గుర్తింపు కార్డును పొందితేనే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. మండలంలో 4 వేల మంది వ్యవసాయ భూములు కలిగిన రైతులు ఉన్నారని, అందులో పీఎం కిసాన్ లబ్ధిదారులు 3800 మంది ఉన్నారని తెలిపారు. 4 వేల మంది రైతులకు గాను 2,450 మంది రైతుల రిజిస్ట్రేషన్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన వారు 27వ తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆమె కోరారు.

పూరి గుడిసె దగ్ధం

వెదురుకుప్పం : మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ గుర్రంవారికండ్రిగలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో హరికి చెందిన పూరి గుడిసె దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న వస్తువులు, నగదు, దుస్తులు అగ్నికి ఆహుతైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ. లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

దొంగ అరెస్టు

గంగాధర నెల్లూరు: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితున్ని అరెస్టు చేశారు. స్థానిక సీఐ శ్రీనివాసంతి వివరాల మేరకు.. గత నెల 27వ తేదీ రాత్రి మండల కేంద్రంలోని దిగువూరు గ్రామంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భానుప్రకాష్ రెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. ఇందుకు సంబంధించి తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా కలశంపాకం తాలూకాకి చెందిన రామజయం (37)ను మండలంలోని తానా చెక్‌పోస్ట్ వద్ద అరెస్టు చేశామన్నారు. నిందితుడి వద్ద నుంచి 22 గ్రాముల బంగారు చైను, మరో 8 గ్రాముల బంగారు ఆభరణాలు, నిందితుడు నేరానికి ఉపయోగించిన ఎరుపు రంగు మారుతి సుజుకి కారును స్వాధీన పరుచుకున్నామని తెలిపారు. అరెస్టు అయిన నిందితుడు రామజయం తమిళనాడు రాష్ట్రంలో గతంలో పలు చోరీలకు పాల్పడ్డాడని, పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్నట్లు తెలిపారు. నిందితుడు రామజయంను ప్రస్తుతం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాసంతి చెప్పారు.

రసాభాసగా ఎమ్మెల్యే థామస్ గ్రీవెన్స్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న వీఎం థామస్

గంగాధర నెల్లూరు: మండలంలో శనివారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రసాభాసగా మారింది. స్థానిక ఎమ్మెల్యే వీఎం థామస్ మండలంలోని ప్రజల సమస్యలు పరిష్కారానికి ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ డే కార్యక్రమం నాయకుల సమస్యలతోనే గడిచిపోయింది. ఉదయం నుంచి సాధారణ ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోకి ఎమ్మెల్యే రావడంతో ఒక్కసారిగా నాయకులు లోపలికి దూసుకు వచ్చారు. దీంతో గేట్లను వేసి నిర్బంధించి పసిపిల్లలు, వృద్ధులు అని చూడకుండా బయటకు తరిమేశారు. అంతేకాకుండా ఇతర మండలాల నుంచి వచ్చిన నాయకులు ఎమ్మెల్యే థామస్‌తో గంటల తరబడి తమ సమస్యలే చర్చించడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొద్దిసేపటికి అధికారులు, పోలీసుల జోక్యంతో వరుస పద్ధతిలో జనాలను లోపలకు పంపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్, సీఐ శ్రీనివాసంతి ప్రజలు పాల్గొన్నారు.

నివాళి

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ మాజీ సర్పంచ్ కృష్ణమ్మ మృతికి పలువురు నివాళులు అర్పించారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, సత్యవేడు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త రాజేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ శనివారం గుర్రంవారికండ్రిగ గ్రామంలో పర్యటించి కృష్ణమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా పెరుమాళ్లపల్లె మాజీ ఎంపీటీసీ మోహన్‌మురళి, ఇరు పార్టీలకు చెందిన నాయకులు కృష్ణమ్మ కుటుంబాన్ని పరామర్శించారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ హేమలత

పాలసముద్రం : క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకుంటే విద్యార్థులు సమాజంలో ఉన్నతస్థాయికి ఎదుగుతారని పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హేమలత, ఎంఈఓ గిరిజ తెలిపారు. శనివారం ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు సరస్వతి పూజ చేసి జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. ప్రిన్సిపల్ హేమలత మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవకుండా ఇష్టపడి చదివేతే పరీక్షలు మంచి మార్కులు సాధించవచ్చన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులే సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. పరీక్షల సమయంలో టెన్షన్ పడకుండా ప్రశాంతంగా రాయాలన్నారు. పరీక్షలో ప్రశ్నపత్రాలను ఒకటికి రెండుసార్లు చదివిన తరువాతనే సమాధానాలు రాయాలని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోం.. అధికారాలు వదులుకోం

- ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు
- బండారం బయటపడుతుందని గుట్టుగా చేసేస్తున్నారు
- అధికారులపై మండలాధ్యక్షుడు, సభ్యుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భార్గవి

నగరి : అభివృద్ధిని అడ్డుకోం.. ప్రజలు తమకు ఇచ్చిన అధికారాలు వదులుకోమని ఎంపీపీ భార్గవి స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని వెలుగు మీటింగ్ హాల్‌లో ఎంపీడీవో ఎన్.కృష్ణయ్య ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రారంభం నుంచి ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారుల వ్యవహార శైలిపై విరుచుకుపడ్డారు. ఎంపీపీ భార్గవి మాట్లాడుతూ మండల పరిషత్ ప్రథమ పౌరురాలైన తనకు మండల కార్యాలయంలో జరిగే ఎలాంటి సమాచారము అందడం లేదన్నారు. మండలస్థాయి అధికారులు వారి శాఖలలో జరిగే పనులను తెలపడం లేదన్నారు. ఉపాధిహామీ కింద చేపట్టే పనులు రెజల్యూషన్ లేకుండానే చేసేస్తున్నారని చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్లను కొత్తగా ఎవరిని నియమించుకున్నారు, ఎవరిని తీసేశారు అనేవి రహస్యంగా ఉంచుతున్నారని చెప్పారు. తమకు తెలిస్తే వారి బండారం బయటపడుతుందని గుట్టుచప్పుడు కాకుండా పనులు చేసేస్తున్నారని దుయ్యబట్టారు. తాము కూడా ప్రజలు ఎన్నుకుంటే వచ్చిన ప్రజా ప్రతినిధులమని వారి అభివృద్ధికి ఎప్పుడూ అండగా నిలుస్తాంగానీ వారిచ్చిన అధికారాన్ని కాలరాస్తే ఊరుకోమన్నారు. అధికారులు పార్టీ రంగులు పూసుకోకుండా పనిచేయాలని సూచించారు.

రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు లేవు

రైతు సేవా కేంద్రాల్లో గతంలో రైతులకు సరిపడా ఎరువులు, పురుగు మందులు, యూరియా ఉండేవని ఇప్పుడు అవి కనిపించడం లేదని వైస్ ఎంపీపీ కన్నియప్ప, మిట్టపాళెం సర్పంచ్ పరంధామన్ వ్యవసాయ అధికారులను నిలదీశారు. త్వరలో వస్తుందని నిల్వ ఉంచుతామని అధికారులు వారికి సమాధానమిచ్చారు. తమ పంచాయతీలో మత్స్యకారులు ఎక్కువగా ఉన్నారని వారితో మత్స్య సహకార సంఘాలు ఏర్పాటుచేయాలని తెరణి సర్పంచ్ నిర్మల డింపుల్ కోరారు. బహువార్షిక పశుగ్రాస పథకం మండలంలో అమలు కావడం లేదని దానిని అమలుచేయాలని ముడిపల్లి సర్పంచ్ ప్రకాష్ కోరారు. ఈ సమావేశంలో డీటీ మేఘవర్ణం, ఎంఈవో శ్రీదేవి, సీడీపీవో కృష్ణవేణి, కోఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.